# మనసు

ఆ రోజు ఆదివారం. ఆనాడు అంటే ఆదివారంనాడు హాస్టలు స్టూడెంట్సుకు పర్వదినం లాంటిది. ఆ రోజుకోసం చంద్రుడికోసం చకోరాలు ఎదురు చూచినట్లు ఎదురు చూస్తారు. వారంలో ఆరు రోజులు చదువుతో విసిగెత్తి ఆదివారమైనా అలా ఉల్లాసంగా సిటీకి వెళ్ళి తిరిగి వద్దామని, సినిమాలు చూద్దామని అనుకుంటారు. అందుకనే ఆనాడు మధ్యాహ్నం భోం చేసిన తర్వాత సిటీకి వెళ్దామని బయలు దేరాను.

అల్లంత దూరంలో ఆర్ట్సు కాలేజీ దగ్గర ఒక బస్సు ఆగి ఉంది. త్వరగా నడిస్తే అందుతుందని త్వరగా నడిచాను. కాని నేను అంతదూరం పోకముందే బస్సు వెళ్ళిపోయింది. నా మనస్సు చివుక్కుమంది. ఛీ పాడు బస్సులు. నేను వచ్చేవరకూ ఆగకూడదూ. నేను బస్సు ఎక్కినాక కదలకూడదూ. మళ్ళీ ఎప్పటికివస్తాయీబస్సులు. అందులో ఆదివారం. బస్సులు చాలా తక్కువగా ఉంటాయి. వీటికి అసలు వేళా పాళా ఉండదు కాబోలు. ఇంకా కాసేపు ఆపితే వాడి సొమ్మేం పోయింది ? అదేమంటే టైము అంటారు. మహా బస్సులన్నీ సరిగా టైముకు నడుస్తున్నట్లు. అలా కాసేపు ఆలోచించసాగాను.

ఇంతలో కోఠీనించి ఆర్ట్సు కాలేజి వరకే ఉన్న బస్సు ఒకటి వచ్చి ఆగింది. నాకు ప్రాణం లేచివచ్చినట్లయింది. ఎందుకంటే నేను సినిమాకి పోవాలని బయలుదేరాను. అప్పటికే రెండు గంటలయింది. ఇంకా అరగంటలో కోఠీకి వెళ్ళకపోతే ఆ రోజుకు ఇక సినిమా లేదు గినిమా లేదు. బస్సు కోఠీవైపు వెళ్ళటానికి తిరిగి వచ్చింది. నేనుబస్సు ఎక్కాను. కాని డ్రైవరు ఇంజను ఆపుచేశాడు, నాకు విసుగుపుట్టింది. కండక్టరును అడిగాను. ఇంకా టైమెంత ఉందని. పదిహేను నిముషములు అన్నాడు. నాకు చిరాకు వేసింది.

బస్సు కాస్త తొందరగా స్టార్టు చేయకూడదూ. అలా చేస్తే రావలసిన వేళకు ముందుగానే వచ్చిందని

---

రెండవ బహుమతి [రు. 25]

బి హెచ్. ఎస్. వరప్రసాద్
ఎమ్. ఎస్ సి. (ప్రీవియస్). యూనివర్సిటీ
సైన్సు కాలేజి. హైద్రాబాదు.

అంతా సంతోషిస్తారుగా. అని అనిపించింది. ఇప్పటు బస్సులో నేనొక్కణ్నే. ఎంతసేపు చూచినా బస్సు స్టార్టు చేయులేదు. పది హేను నిముషములు అయింది. ఇప్పుడు బస్సు నిండా హాస్టలు స్టూడెంట్సుతో నిండిపోయింది. వాళ్ళలో వాళ్ళు అనుకుంటున్నారు "ఈ బస్సు దొరకటం చాల లక్కీ. ఇది దొరక్క పోయినట్లయితే చాల తిప్పలయేది" అని. బస్సు కదిలింది. అప్పుడనిపించింది. మనసు ముందు ఎప్పుడూ తన బాగేకాని పరుల కష్టసుఖాలు ఆలోచించదని.

మొదటిసారి నేను బస్సు మిస్సు అయినిపుడు బాధపడ్డాను. నేను బస్సు ఎక్కినాక బస్సు తొందరగా కదల కూడదా అనుకున్నాను. టైముతో లెక్కేమిటి అనుకున్నాను. కాని అదే బస్సు టైముకు కాక ముందుగానే స్టార్టు చేసినట్లయితే ఎంత మంది కుర్రవాళ్ళకి ఆ బస్సు తప్పిపోయేది. వాళ్ళు వేరే బస్సు కోసం చాలా సేపు వెయిట్ చెయ్యాల్సి వచ్చేది. మొదటిసారి నా పరిస్థితి వాళ్ళ పరిస్థితితో పోల్చుకున్నాను. అప్పుడనిపించింది. వద్దు, వద్దు బస్సులు నియమితకాలం ప్రకారమే నడవాలి. ఒకరికోసం ఆగావద్దు. ఒకరికోసం ముందుగా పోనూవద్దు అని.

ఇలా ఆలోచించేటప్పటికి నా మనస్సు ఎంతో హాయి అనిపించింది.

□□□

